జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

● కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ సమైక్యతా ఉత్సవాలు ● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి





సాక్షి, మేడ్చల్ జిల్లా: అన్ని రంగాల్లో మేడ్చల్ జిల్లా అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో ఉందని, ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన, ఫ్యాక్టరీలు , నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాచరికం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికి... అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధులందరికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్‌లో విలీనమై, 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మన సొంతం కావడానికి ఎంతో మంది త్యాగాలు చేశారన్నారు.

◆ ఆంధ్ర పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా తెలంగాణలో 1969లో తొలిదశ ఉద్యమం జరిగిందని, ఆ తర్వాత జరిగిన మలిదశ పోరాటాన్ని ఉద్యమ నాయకుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గాంధేయ మార్గంలో నడిపించారన్నారు. ఫలితంగా 2014,జూన్ 14న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి అనతికాలంలోనే అద్భుత ప్రగతిని సాధించి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. దశాబ్ద కాలంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా. రైతు బంధు, రైతు జీవిత బీమా అమలు చేస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, గృహ లక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 101 బస్తీ దవాఖానాల ద్వారా 52 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. నీటిపారుదల విద్యా, వైద్య, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో మేడ్చల్ జిల్లా పురోగతి సాధిస్తోందన్నారు. రాబోయే కాలంలో అందరం ఇలాగే కలిసి మెలిసి సమాలోచనలు, సమీక్షలు చేసుకుంటూ జిల్లాను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అంతకు ముందు జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు మంత్రి మల్లారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు మధుకర్‌రెడ్డి ,దర్గదయాకర్‌రెడ్డి,బోయపల్లి కొండల్‌రెడ్డి, డీసీపీ శబరీష్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రాంమోహన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తిదారుల సంక్షేమమే ధ్యేయం

సాక్షి,మేడ్చల్ జిల్లా: పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా బీసీ సంక్షేమ శాఖ ద్వారా చేతి కుల వృత్తుల వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి మంత్రి మల్లారెడ్డి విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ,బిసి సంక్షేమ శాఖ అధికారి కేశురాం, కలెక్టరేట్ ఏవో రాంమోహన్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు నందారెడ్డి,దర్గయాకర్‌రెడ్డి ,ఓడీసీఎం ఉపాధ్యాక్షుడు మధుకర్‌రెడ్డి,పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఘనంగా విశ్వకర్మ జయంతి

కీసర: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జి.ఆర్.ఎస్.ఎస్ గార్డెన్‌లో కీసర మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి ,మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి విశ్వబ్రాహ్మణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం బీసీ కులస్తులకు రూ. లక్ష చొప్పున ఆర్థికసాయం అందజేసి కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుంటుందన్నారు. అంతకుముందు నిర్వహించిన యజ్ఞంలో పెద్ద ఎత్తున విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, సంఘం అధ్యక్షులు బాలలింగాచారి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రచారి, కోశాధికారి ఎర్రోజు చంద్రమౌళిచారి, గౌరవ అధ్యక్షులు కీసర ప్రభాకర్‌చారి, గనోజు శ్రీనివాస్‌చారి, రవింద్రచారి, నాగరాజుచారి, ఉపాధ్యక్షులు రాముచారి, వివేకానందచారి, తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

క్లుప్తంగా...

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు

పోచారం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతల యాదయ్య అన్నారు. ఆదివారం అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో తెలంగాణ విలీన వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న యాదయ్య మాట్లాడుతూ.. నైజాం ప్రభుత్వ దౌర్జన్యాలకు 4 వేల మంది అమరులయ్యారని గుర్తు చేశారు. సాయుధ పోరాటంతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సబిత, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జెయింట్స్, ఫ్రెడ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా నిరుపేదలకు ఒక నెలకు సరిపడ నిత్యావసర వస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ డిస్ట్రిక్ట్ 320 బి. గవర్నర్ లయన్ రేసు మల్లారెడ్డి, లయన్ హర్బిందర్‌సింగ్ , లయన్ రఘుప్రసాద్, లయన్‌చంద్రశేఖర్, లయన్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ రహిత సమాజం



చిట్టేరుకుంటను శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఆదివారం స్వచ్ఛ భారత్ దివస్‌లో భాగంగా వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి చిట్టేరుకుంటను శుభ్రం చేశారు. పట్టణంలోని చెత్తను సేకరించి రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటరెడ్డి, రమాదేవి, శశికళ, మల్లేశ్, జహంగీర్, నరేశ్‌యాదవ్, రవీందర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిరాజ్, రహీం, విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డుకు చెందిన మడిపడిగే ప్రవీణ్ ప్రమాదానికి గురై కాలువిరిగి బెడ్‌పై నుండి లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలియడంతో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆదివారం బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు. అనంతరం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ, జంగయ్యయాదవ్, అస్లాం, జహంగీర్, హరిశంకర్, ఫయూమ్, సందీప్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపాలిటీ రెడ్డి సంఘం అధ్యక్షుడు కట్ట జనార్దన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం సమర్పించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రసాదించిన రిజర్వేషన్లతో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారు సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. అరుణ్‌కుమార్, దాస్, నర్సింగ్‌రావు, బాలయ్య, రాజేశ్, జహీరుద్దీన్, గణేశ్, నవీన్‌కుమార్, రూపేశ్‌కుమార్, పాండ, రిషికుమార్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో లభ్యమైన పుర్రె, ఎముకలు మనిషివే

శామీర్‌పేట్: శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభ్యమైన పుర్రె, ఎముకలు మనిషివేనని వైద్యులు నిర్ధారించారు. శనివారం స్థానిక గ్రోమోర్ వెనక గల ఓ వెంచర్‌లోని పాడుబడిన సంపులో పుర్రె, ఎముకలు లభ్యమైన సంగతి విదితమే. గుర్తు పట్టలేని స్థితిలో ఉన్న వాటిని శామీర్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఆదివారం వైద్యుల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో పుర్రె, ఎముకలు మనిషివేనని వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. అయితే అవి మహిళవా లేక ట్రాన్స్‌జెండర్ వా అని నిర్ధారించేందుకు మరిన్ని పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వాలీబాల్ పోటీల్లో మేడ్చల్‌కు ద్వితీయ స్థానం



మేడ్చల్ వాలీబాల్ జట్టు

మేడ్చల్: నియోజకవర్గ పరిధిలోని కీసరలో ఆదివారం నిర్వహించిన జిల్లా వాలీబాల్ అండర్-17, అండర్-14 విభాగాల్లో మేడ్చల్ జోనల్ జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్-17 విభాగంలో బాలికల జట్టు, అండర్ 14విభాగంలో బాలుర జట్లు ఫైనల్ లో తలపడి రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలను జోనల్ స్పోర్ట్స్ సెక్రటరీ నాగరాజు, పీడీ, పీఈటీలు అభిన ంధించారు.

అనాథలకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: భారత ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అవుషాపూర్ సర్పంచ్ కావేరితో కలిసి ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, బిస్కెట్లు, అనాథ పిల్లలు, అనాథాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్, శివనాయక్, వీరారెడ్డి, విక్రాంత్‌రెడ్డి, సురేందర్, సత్యనారాయణరెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, బస్వరాజ్, ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

బోడుప్పల్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ అన్నారు. శివపురి కాలనీ ఫేస్ 4లో నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులందరూ సమష్టిగా కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీందర్‌నాయక్, కాలనీవాసులు సాంబశివరావు, ఎస్ఎం భాష, ఎం రమేష్, మహేష్, నర్సింహాచారి, సాయి రోహిణి కుమార్, తులసి రావు, అరవింద, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ఆదివారం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి పాటల పుస్తకాన్ని రాచకొండ డీసీపీ గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత కందుకూరి శ్యాంసుందర్ రెడ్డి పుస్తక ముద్రణకు సహకరించడం అభినందనీయమన్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి పాటల పుస్తక రచయిత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత అనుముల ప్రభాకరా చారిని, నిర్వాహకులను అభినందించారు.వెంకటేశం, వెదిరె వెంకట నర్సింహారెడ్డి,రమేష్ గుప్త,శ్రీనివాస్ రెడ్డి,దీప్తి, తాడోజు జగన్నాద చారి, స్వరూపరాణి, సునీత పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



కీసర: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగారం,దమ్మాయిగూడ, కీసరమండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. నాగారం మున్సిపాలిటీల్లోని 8, 17,7,తదితర వార్డుల్లో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో కీసర సీఐ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణలో భాగంగా మనమంతా మట్టి గణపతులను పూజించి పండుగను ప్రశాంతమైన వాతవరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కౌకుట్ల మమత కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, గూడురు సవితాఆంజనేయులు, నేతలు రాహుల్‌రెడ్డి, నిమ్మలశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో శ్రీ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసిన శ్రీ స్పోర్ట్స్ క్లబ్‌ను ఆదివారం మల్కాజిగిరి భీసీపీ నరేష్ రెడ్డి, ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల్ శ్రీనివాసగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు స్పోర్ట్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆటలు దోహదం చేస్తాయన్నారు. నిర్వాహకులు సంతోష్‌కుమార్, తన్మాయానంద్, ప్రదీప్ గౌడ్, సంపీప్ గౌడ్ పాల్గొన్నారు.

స్పందించారు..కాపాడారు

● కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్యాయత్నం
● తక్షణమే స్పందించి కాపాడిన పోలీసులు

పోచారం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను పోచారం పెట్రోలింగ్ పోలీసులు రక్షించారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కుషాయిగూడకు చెందిన ముదిగొండ ప్రియాంక (33) అన్నోజిగూడలోని ఓయో గదిలో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని హార్పిక్ తాగి, చున్నీతో ఫ్యాన్‌కు వేలాడుతున్న వీడియోను వాట్సాప్ స్టాటస్‌లో పోస్ట్ చేసింది. దీనిని చూసినవారు 100 నంబర్‌కు సమాచారం అందించారు. తక్షణమే స్పందిచిన పోలీసులు హోటల్‌కు వెళ్లి గది తలుపులు తెరచి చూడగా ప్రియాంక అపస్మారక స్థితిలో పడిఉంది. దీంతో ఆమెను సమీపంలోని నీలిమ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బంధువులకు అప్పగించారు. ప్రియాంకకు 2016లో చిరంజీవితో వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె. కుటుంబ కలహాల కారణంగా 2019లో భర్త నుండి విడిపోయి దిల్‌సుఖ్‌నగర్‌లో తల్లితో కలిసి ఉంటోంది. తల్లి మరణానంతరం 2022 నుంచి ఎస్ఆర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉండేది. ఆమె మామ గత అక్టోబర్‌లో యాదగిరిగుట్టకు చెందిన రవితో వివాహం చేశాడు. కాగా, రవికి మరో భార్య ఉందని, వీరికి ఇద్దరు పిల్లలున్నట్లు తెలిసింది. వారం రోజుల క్రితం ఆఫీస్ పనిమీద వెళ్తున్నట్లు చెప్పి రవి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. దీంతో మనస్తాపానికి లోనైన ప్రియాంక ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జవహర్‌నగర్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ సీజన్ - 2 లో భాగంగా ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని కోళ్ల ఫారం బస్టాప్ నుంచి ఫైరింగ్ కట్ట వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొన్న అనంతరం చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయవద్దని, తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటో రిక్షాలోనే వేయాలన్నారు. జవహర్‌నగర్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు మేకలలితాయాదవ్, పల్లపు రవి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విమోచన దినోత్సవం



గిర్మాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.డబీల్‌పూర్, గౌడవెల్లి, అత్వెల్లి,గిర్మాపూర్ , మేడ్చల్‌లలో వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రెండు పార్టీల ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవంపై ప్రభుత్వ వైఖరి దారుణం

ఘట్‌కేసర్: అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం సిగ్గుచేటని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాల్సిన అవసరం లేదనడం వారి స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు రామతీర్థ, రవీందర్‌రెడ్డి, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, పీ మహిపాల్‌రెడ్డి, సుభాషిణీ, చందు, సీ మహిపాల్‌రెడ్డి, మాధవి, సంతోషి, బిక్కునాయక్ పాల్గొన్నారు.

కీసర: తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రమైన కీసర, నాగారం మున్సిపాలిటీపరిధిలోని రాంపల్లి, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో బీజేపీ నేతలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, నేతలు సింగిరెడ్డివెంకట్‌రెడ్డి, వంగేటిబాపిరెడ్డి, కోల బాల్‌రాజ్, నల్లవెంకట్‌రెడ్డి, బండారిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



కీసరలో..

ముమ్మరంగా స్వచ్ఛత లీగ్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గవర్నమెంట్ స్కూల్‌తో పాటు, 6వ వార్డులోని మేధా పార్కు సమీపంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛత లీగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి చెత్తచెదారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా స్కూల్స్, దేవాలయాలు, పార్కులు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో...

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం స్వచ్ఛతలీగ్ కార్యక్రమంలో భాగంగా చైతన్యస్కూల్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు, ఆర్‌జీకేకాలనీలో అంబేడ్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంచేసి ప్లాస్టిక్‌ను ఏరివేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం స్వచ్ఛత లీగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి వీధులు, రోడ్లను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేయించారు. మేడ్చల్ పట్టణాన్ని స్వచ్ఛత వైపు నడిపించేందుకు బాధ్యత గల అందరూ కృషి చేయాలన్నారు. 10వ వార్డులో జైన్ మందిర్ వద్ద కార్మికులతో కలిసి ఆమె రోడ్లను, వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కౌన్సిలర్ శివకుమార్, మేనేజర్ శ్రీదేవి, ఆర్ రాంచందర్, సానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీలో..



వీధులను శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..